ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 | కనిష్ఠం : 20.0
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
మంగళవారం 6 ఫిబ్రవరి 2024



పాఠశాలల్లో వసతులు.. మెరుగు పడేనా?



గద్వాల మండలం రేకులపల్లిలో గదులు చాలక ఆరుబయట కూర్చున్న విద్యార్థులు

- మధ్యలోనే ఆగిన మన ఊరు-మన బడి పథకం
- పెండింగ్‌లో కోట్ల రూపాయల బిల్లులు.. ఇబ్బందుల్లో కాంట్రాక్టర్లు
- ప్రతీ నియోజకవర్గానికి రూ.2 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిలాలోని 4,182 పాఠశాలలకు రూ.28 కోట్ల కేటాయింపు

గద్వాల, ఫిబ్రవరి 5: ప్రభుత్వ పాఠశాలలు గత కొన్నేళ్లుగా సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. నిధుల కొరత కారణంగా కనీస సౌకర్యాలు కరువై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫండ్ విడుదల చేయడంతో సమస్యలు పరిష్కారం కానున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాఠశాలల గదుల పైకప్పు పెచ్చులు ఊడటం, అదనపు గదులు లేక ఆరుబయట తరగతులు నిర్వహించడం, మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగు నీరు లేకపోవడం, ప్రహరీలు లేక కుక్కలు, పందులు స్వైర విహారం చేయడం వంటి సమస్యలు ఉన్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు గత ప్రభుత్వం మన ఊరు - మన బడి పథకాన్ని ప్రారంభించింది. కానీ నిధుల కొరత కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. బిల్లులు రాక కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులను ఆపేశారు. దాంతో పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.10 కోట్లు ఎస్‌డీఎఫ్(స్పెషల్ డెవలప్ ఫండ్) విడుదల చేసింది. వటిలో మౌలిక వసతులకు రూ.2 కోట్లు, మంచి నీటికి రూ.కోటి, భవనాల నిర్వాహణకు రూ.50 లక్షలు పోను మిగిలిన రూ.6.50 కోట్లను ఇతర అభివృద్ధి పనులకు ఉపయోగించుకునేలా ఇంచార్జ్ మంత్రులకు అప్పగించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.140 కోట్లు విడుదల కాగా, 4,182 పాఠశాలల్లో వసతుల కోసం రూ.28 కోట్లు ఖర్చు చేయనున్నారు.



జమ్మిచేడు పాఠశాలలో మధ్యలోనే ఆగిన మన ఊరు మన బడి పథకం కింద చేపట్టిన అదనపు గదుల నిర్మాణం

పరిష్కారానికి అవకాశం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,182 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో ప్రాథమిక పాఠశాలలు 2,335 ఉండగా ప్రాథమికోన్నత పాఠశాలలు 839, ఉన్నత పాఠశాలలు 1,008 ఉన్నాయి. వీటిలో చాలా పాఠశాలల్లో మౌలిక వసతులు కరవడ్డాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మన ఊరు - మన బడి పథకం ద్వార కొన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభించింది. వీటికి స్కూల్ ఎడ్యుకేషన్ కాంపోనెంట్, ఉపాధి హామీ పథకం, సెంట్రల్ ప్రొక్యెయ్‌మెంట్ నిధులు కేటాయించింది. వాటిలో ఉపాధి హామీ పథకం నిధులు విడుదల కాలేదు. స్కూల్ ఎడ్యుకేషన్ కాంపోనెంట్ నిధులు కూడ అరకొరగానే విడుదల కావడంతో బిల్లులు రాక కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు వదిలేశారు. కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తయినా బిల్లులు అందలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తుందా? లేదా? అనే సందిగ్ధం నెలకొన్న సమయంలో ఎస్‌డీఎఫ్ కింద మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల చేసింది. ఈ నిధులతోనైనా కొన్ని పాఠశాలల్లో సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం, ప్రహరీ వంటి నిర్మాణాలతో పాటు గదులకు మరమ్మతులు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నడిగడ్డలో ఎవరి ప్రతిపాదనలకు ప్రాధాన్యం?

ఎస్‌డీఎఫ్ నిధులతో పనులను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అనుమతితో చేపట్టనున్నారు. ప్రభుత్వం జిల్లా ఇన్‌చార్జి మంత్రులకే నిధులు కేటాయిస్తూ, ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యేలు తమ పరిధిలోని పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌కు నివేదిస్తే ఆయన ప్రతిపాదనలు తయారు చేసి, ఇన్‌చార్జి మంత్రి అనుమతి కోసం పంపుతారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో 12 చోట్ల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. కానీ నడిగడ్డలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచారు. ఇక్కడ జడ్పీ చైర్‌పర్సన్ సరిత గద్వాల, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అలంపూర్ నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌చార్జీలుగా ఉన్నారు. వీరిలో ఎవరి ప్రతిపాదనలకు ఓకే చెబుతారన్న చర్చ జరుగుతోంది. తమ ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేసింది కాబట్టి తామే ప్రతిపాదనలు పంపుతామని, గద్వాల నియోజకవర్గంలో విద్యకోసం మరో రూ.2 కోట్లు అదనంగా ఖర్చు చేస్తామని జడ్పీ చైర్‌పర్సన్ సరిత చెప్పడం కొసమెరుపు. సీడీఎఫ్ నిధుల విషయంలో తమ జోక్యం ఉండదని ఆమె చెప్పారు.

సరెండర్ లీవ్స్
ప్రోత్సాహకంపై ఆశలు

- బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన మూడు సరెండర్స్
- జనవరితో కలిపి చెల్లించాల్సినవి నాలుగు
- టీఏ, డీఏలదీ అదే పరిస్థితి
- ఇతర శాఖల్లో పని చేస్తున్న పోలీసులకు క్లియర్ చేసిన ప్రభుత్వం



ఇటీవల మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న పోలీసులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 5: పోలీస్ ఉద్యోగం అంటే కత్తిమీద సాములాంటిది. ఎప్పుడు ఏ ఉపద్రవం వస్తుందోనని నిత్యం అలర్ట్‌గా ఉండాలి. ఇతర ఉద్యోగుల మాదిరిగా వీరికి పండగలు, ఆదివారం సెలవులు ఉండవు. నెలలో 30 రోజులూ డ్యూటీలో ఉండాల్సిందే. అందుకే వీరికి ప్రభుత్వం ప్రోత్సాహకంగా సరెండర్ లీవ్స్ పేరుతో ప్రోత్సాహకం అందిస్తోంది. ఉద్యోగుల సీనియారిటీని బట్టి బేసిక్‌పై సరెండర్స్ ఇస్తారు. ఇలా నాలుగు నెలలకోసారి వీరికి సరెండర్ సెలవుల పేరిట చెల్లింపులు చేస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సరెండర్స్ పెండింగ్‌లో పెట్టింది. పోలీస్ ఉద్యోగులు వాటికోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా వీటిని మంజూరు చేస్తుందన్న ఆశతో పోలీసులు ఎదురుచేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో దాదాపు 3,000 మంది పోలీసులు ఉన్నారు. వీరికి బేసిక్ ప్రకారం మూడు సరెండర్స్ పెండింగ్‌లో ఉండగా, జనవరితో నాలుగో సరెండర్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి తోడు ఆరు నెలలుగా టీఏ, నాలుగేళ్లుగా డీఏలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా ఒక్కో ఉద్యోగికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రావాల్సి ఉంది.

పిల్లల చదువులకు ఉపయోగపడతాయని..

సరెండర్స్ క్రమం తప్పకుండా చెల్లిస్తే పిల్లల చదువులు, వైద్య ఖర్చులకు ఉపయోగపడతాయని చాలామంది పోలీసులు భావిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు వస్తే తమ అవసరాలకు వాడుకుంటామని బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్దలందరి చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. అవి వస్తే ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవడానికో, పిల్లలకు ఉన్నత చదువులకో, వాహన కొనుగోళ్లకో ఉపయోగపడతాయని చాలా మంది చాలా రోజులుగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సరెండర్స్‌పై ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే ఈ ప్రక్రియను ప్రారంభించిందని, తొందరలోనే వచ్చే అవకాశం ఉందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులుగా ఎంపికై ట్రాన్స్‌కో, టెలికాం, ఆర్టీసీ, రవాణా శాఖల్లో పని చేస్తున్న వారికి సరెండర్స్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. తమకూ వస్తాయని పోలీసులు ఆశిస్తున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది

పోలీసులకు సరెండర్స్, టీఏ, డీఏలు రాకపోవడంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ఎన్నోసార్లు గత ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం. కానీ రాలేదు. ఎంతో మంది ఇబ్బందుల్లో ఉన్నారు. సరెండర్స్ వస్తే తమ అవసరాలకు ఉపయోగపడతాయని ఎదురు చూస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం అవి ఇస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

- వెంకటయ్య, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆ మూడెకరాల్లో.. భూమంతర్

- కౌలు రైతు ఉండగానే అక్రమంగా నాలా, డీటీసీపీ లే అవుట్ మంజూరు
- ప్రజాప్రతినిధుల ఫిర్యాదుతో కదులుతున్న డొంక
- లబోదిబోమంటున్న ప్లాట్ల కొనుగోలుదారులు




కౌలు రైతు ఉన్నా నాలా, డీటీసీపీ అనుమతులు ఇచ్చిన స్థలం ఇదే

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం చుట్టు పక్కల జరిగిన భూ అక్రమాలు ఒక్కోటి వెలుగులోకి వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ మాఫియా అరాచకాలు బయటపడుతున్నాయి. ఇందులో మధ్య తరగతి ప్రజలే సర్వస్వం కోల్పోయిన అంశం జిల్లా కేంద్రంలో హాట్‌టాపిక్‌గా మారింది. రెవెన్యూ, మునిసిపల్ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో లోపాయికారిగా ఒప్పందాలు కుదుర్చుకొని, ప్రజల్ని నిండా ముంచడానికి సహకరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. పదేళ్ల కాలంలో జరిగిన భూ అక్రమాలపై ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ఆరా తీయడం, ఎక్కడ ఏమేం జరిగిందో సమగ్ర వివరాలు అందించాలని కోరడంతో పాపంలో పాలుపంచుకున్న అధికారులు బెంబేలెత్తుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని కొల్లాపూర్ చౌరస్తాలో గజం భూమి విలువ దాదాపు రూ.50 వేలు ఉంది. దీనిని సొమ్ము చేసుకోడానికి రియల్టర్లు రంగంలోకి దిగారు. సర్వే నెంబరు 46, 47లో కౌలు దారులు ఉన్నట్లు రెవెన్యూ కౌలు రికార్డులో స్పష్టంగా ఉంది. ఈ విషయమై తహసీల్దార్ రాతపూర్వకంగా ధ్రువీకరణ పత్రం కూడా ఇచ్చారు. రెవెన్యూ చట్టం ప్రకారం కౌలు రైతు ఉంటే అక్కడ నాలా అనుమతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదు. డీటీసీపీ అనుమతులు రానే రాకూడదు. కౌలు రైతు లేదా అతని వారసుడు లేకపోతే ప్రభుత్వం ఆ భూమిని వివిధ అవసరాల నిమిత్తం తీసుకునే అవకాశం ఉంది. అయితే రియల్ ఎస్టేట్ మాఫియా చేష్టలకు ప్రభుత్వ నిబంధనలు బేఖాతరయ్యాయి. కొందరు అధికారుల చేతి వాటం ముందు చట్టాలు చుట్టబండలయ్యాయి. ఫలితంగా ఆ సర్వే నంబర్లలోని మూడెకరాల భూమిలో అక్రమంగా వెంచర్ వెలిసింది. గజం భూమి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు విక్రయించిన రియల్ ఎస్టేట్ మాఫియా రూ.కోట్లల్లో సొమ్ము మూటగట్టుకుంది. తీరా పైసాపైసా కూడబెట్టుకుని అందులో ప్లాట్లు కొన్న మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆ సర్వే నెంబరులో కౌలు రైతు ఉన్నట్లు బయటకురావడంతో మున్ముందు నిర్మాణాలకు అనుమతులు వచ్చే అవకాశం లేక కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు. అయితే ప్రభుత్వం మారిన వెంటనే ఈ సర్వే నెంబర్లకు సంబంధించిన రికార్డులను తారుమారు లేదా మాయం చేయడానికి మాఫియా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 46, 47 సర్వే నెంబర్లలో కౌలు రైతు ఉన్నట్లు నాగర్‌కర్నూల్ తహసీల్దార్ జారీ చేసిన సర్టిఫైడ్ కాపీ అప్పటికే బయటకు రావడంతో వారి పన్నాగం బెడిసికొట్టింది. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో జరిగిన ఈ భూ బాగోతంపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. బాధితులకు న్యాయం చేస్తారా? లేక వారి డబ్బులు వెనక్కి ఇప్పిస్తారా? అన్నది తేలాల్సి ఉంది.

కొమ్మకొమ్మకో కొంగ



చెట్లపై తెల్లగా కనిపిస్తున్న ఇవి పూలనుకుంటే మీరు చెరువులో కాలేసినట్లే. మోడు వారిన చెట్లపై వాలిన కొంగలు పువ్వుల్లా కనిపిస్తూ అబ్బుర పరుస్తున్నాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం చెన్నూరు గ్రామంలోని అనంతగిరి చెరువులో కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

కాంగ్రెస్‌లోకి మన్నె జీవన్‌రెడ్డి

- నేడు మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో చేరిక
- అనుచరులతో కలిసి ఢిల్లీ బయల్దేరిన నాయకుడు



మన్నె జీవన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డి సోదరుడి కుమారుడు, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ డైరెక్టర్ మన్నె జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు ఆయన సోమవారం రాత్రి కొందరు అనుచరులతో కలిసి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్నారు. జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతారని కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఆయన పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. జీవన్‌రెడ్డి గతంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని మునిసిపాలిటీలు, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించారు. 2019 ఎన్నికల్లో మన్నె శ్రీనివాస్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడంతో.. ఆయన ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత జీవన్‌రెడ్డికి టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం దక్కింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ పోటీకి ఆసక్తి చూపినప్పటికీ బీఆర్ఎస్ సిట్టింగులకే టికెట్లు ఇవ్వడంతో పార్టీ అభ్యర్థుల కోసం పనిచేశారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి.. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ తిరిగి మన్నె శ్రీనివాస్‌రెడ్డికే కేటాయిస్తారనే ఊహాగానాల నేపథ్యంలో జీవన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై జీవన్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా.. పార్టీలో చేరుతున్న విషయం వాస్తవమేనని అన్నారు. మంగళవారం తాను ఒక్కడినే జాయిన్ అవుతానని, త్వరలో మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే సభలో తన అనుచరులు, అభిమానులు పార్టీలో చేరుతారని తెలిపారు.

పునర్నిర్మాణంలో భాగస్వాములవుదాం

- ప్రొఫెసర్ కోదండరాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

కల్వకుర్తి, ఫిబ్రవరి 5 : తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములవుదామని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలను సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన కోదండరాంకు ఉద్యోగులు, నిరుద్యోగులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల నిరంకుశ పాలన కొనసాగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, గెస్ట్‌లెక్చరర్లు న్యాయమైన డిమాండ్లను అంగీకరించాలని వినతి పత్రాలు ఇచ్చారని, సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. తెలంగాణకు రావాల్సిన కృష్ణా నది జలాల్లో తీరని అన్యాయం జరిగినా బీఆర్ఎస్ పాలనలో పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కేంద్రం తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను తేల్చి, న్యాయం చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని వినతి

సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఉద్యోగులు కోదండరాంకు వినతి పత్రం అందజేశారు. అనంతరం టీఎస్‌సీపీఎస్ ఈయూ క్యాలెండర్‌ను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదానందంగౌడ్, జంగయ్య, రవి, లక్ష్మీనరసింహారావు, రమేష్, వేణు, సురేష్, వెంకట్ ఉన్నారు.

అభయుడి సన్నిధిలో..

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కోదండరాం ఆంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు ఆలకుంట వెంకటేష్, సదానందంగౌడ్, శివకుమార్, మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు మనోహర్‌రెడ్డి, పాల్గొన్నారు.

జీవో 69 ద్వారా ప్రతీ ఎకరానికి నీరు అందిస్తాం

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి



కోటకొండలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, వేదికపై చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు

దామరగిద్ద, ఫిబ్రవరి 5 : జీవో 69 అమలు చేసి నారాయణపేట జిల్లాను పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలం చేస్తానని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. పాలమూరు న్యాయ పాదయాత్రలో భాగంగా సోమవారం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలోని క్యాతన్‌పల్లి భద్రకాళీ వీరభద్రేశ్వర దేవాలయంలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్యాతన్‌పల్లి, బాపన్‌పల్లి గ్రామాల్లో వారు పలు కాలనీల్లో తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దామరగిద్దలో పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్పను సన్మానించారు. సంతబజారులో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ ఎడారిగా మారిన బీడు భూములను జీవో 69 అమలు చేసి ఈ ప్రాంత రైతుల కాళ్లు కడుతామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్‌ను రూ.1200లకు పెంచి ప్రజలను మోసం చేసిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓట్ల ద్వారా బుద్ధి చెప్పాలని అన్నారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండు పథకాలు అమలు చేశామన్నారు. ఎమ్మెల్యేకు ఓటు వేస్తే నీళ్లు వస్తున్నాయి.. ఎంపీకి ఓటు వేస్తే ఢిల్లీ నుంచి నిధులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రసన్నరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఫుట్టి ఈదప్ప, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులున్నారు.

మరికల్‌లో మార్నింగ్ వాక్

మరికల్ : పాలమూరు న్యాయ పాదయాత్రలో భాగంగా ఆదివారం రాత్రి నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని దళితవాడలోని చెన్నయ్య స్వగృ హంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి బస చేశారు. సోమవారం ఉదయం ఐదు గంటలకు కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి వంశీచంద్‌రెడ్డి మార్నింగ్ వాక్ చేశారు. బాలికల ఉన్నత పాఠశాలలో పార్టీ కార్యకర్తలతో క్రికెట్ ఆడి గ్రామస్థులను ఉత్తేజపరిచారు. ఇందిగాంధీ చౌరస్తాలోని ఓ టీ స్టాల్‌లో టీ తాగుతూ అందరినీ ఆకట్టుకున్నాడు. మండల పరిధిలోని అప్పంపల్లి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త దండు శ్రీనివాస్‌రెడ్డి మృతి చెందడంతో కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహంపై పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం హనుమాన్‌వాడలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడానికి కంకణం కట్టుకున్నారన్నారు. వంశీచంద్‌రెడ్డి వెంట పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న, సూర్యచంద్ర ఫౌండేషన్ చైర్మన్ సూర్యమోహన్‌రెడ్డి, హరీశ్, గోవర్ధన్, దండురాములు, జంగిడి రాజు, కార్యకర్తలు ఉన్నారు.

కేసీఆర్ కుటుంబం రాష్ట్రానికి ఎనిమిది లక్షల కోట్ల అప్పును ఇచ్చింది

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నారాయణపేట, ఫిబ్రవరి 5: కేసీఆర్ కుటుంబం తెలంగాణా రాష్ట్రాన్ని ఎనిమిది లక్షల కోట్ల అప్పుల పాలు చేసిందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. పాలమూరు న్యాయ యాత్రలో భాగంగా సోమవారం రాత్రి పేట మండలం కోటకొండ, జాజాపూర్, కొల్లంపల్లి గ్రామాల్లో జరిగిన సభనుద్దేశించి మంత్రి ప్రసంగించారు. కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ పార్టీ బంగారు పల్లెంలో తెలంగాణాను కాంగ్రెస్‌కు ఇచ్చామని చెబుతున్నా ఎనిమిది లక్షల కోట్లు అప్పుల పాలు చేశారని ధ్వజమెత్తారు. నారాయణపేట ప్రాంతానికి సాగునీరందించకుండా బీఆర్ఎస్ పాలకులు మోసం చేశారన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంతో నాలుగు లక్షల ఎకరాలకు, నెట్టెంపాడ్‌తో రెండు లక్షలు, భీమాతో రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. తమ ప్రభుత్వ హయాంలోనే నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని సాధించి సాగునీటిని అందిస్తామన్నారు. కోటకొండను మండలంగా ఏర్పాటు చేస్తామన్నారు. రాహుల్‌గాంధీని స్ఫూర్తిగా తీసుకొని వంశీచంద్‌రెడ్డి న్యాయయాత్ర చేస్తున్నారని, వందలాది మందిని కోల్పోయిన వారిని దృష్టిలో ఉంచుకొని సోనియమ్మ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి కన్నతల్లి పాత్ర పోషించి నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని మంత్రి పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చారకొండ, ఫిబ్రవరి 5 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని చంద్రాయన్‌పల్లి వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..

చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన జమ్ముల సుల్తాన్ గ్రామ శివారులోని వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా తరలిస్తుండగా తిమ్మాయిపల్లి వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. అనుమతులు లేకుండా చారకొండ, చంద్రాయన్‌పల్లి, గోకారం వాగుల నుంచి ఇసుకను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఎస్సై వెంట సిబ్బంది హరిలాల్, రేణయ్య, అరుణాచలం తదితరులున్నారు.

ఓపెన్ పది, ఇంటర్ పరీక్ష ఫీజును

ఈనెల 21లోగా చెల్లించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 5 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ చదివే అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజులను నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్‌లో గానీ, టీఎస్ మీసేవా కేంద్రాల్లో ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించాలని పేర్కొన్నారు. ఏప్రిల్, మే నెలలో జరిగే పరీక్షలకు గాను రూ.25 అపరాధ రుసుముతో ఈనెల 27లోపు, రూ.50 అపరాధ రుసుముతో మార్చి 4వ తేదీలోపు చెల్లించే అవకాశం ఉందని తెలిపారు.

కృష్ణా బేసిన్ కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్తే

పాలమూరుకు సాగు, తాగునీటి కష్టాలే

» మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణ బేసిన్‌ను కేఆర్ఎంబీ పరిధిలోకి ఇచ్చేందుకు సంతకాలు చేసిందని, దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగు, తాగునీటి కష్టాలు మొదలౌతాయని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఓటమికి ప్రతీ ఒక్కరం బాధ్యులమని, తప్పులు జరిగాయని, కార్యకర్తల అభిప్రాయాలను అర్థం చేసుకోలేక పోయామని, తప్పులను సరిదిద్దుకోవాల్సిన అవసరముందన్నారు. భవిష్యత్ కార్యాచరణపై దృష్టిని సారిద్దామని, ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో జీఓ 69 అమలు చేస్తే ఈ ప్రాంతానికి నష్టమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తే నేరుగా లబ్ధిదారుని ఖాతాలోకి వెళ్లేదని, దీంతో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలకు సంబంధాలు లేకుండా పోయాయని, ఎమ్మెల్యేలు అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు. పార్టీలో ఉంటూ వెన్నుపోటు పొడిచిన వారు సైతం ఉన్నారని, అధికారంలో ఉన్న పార్టీలోకి వెళ్లేవారు అవకాశవాదులన్నారు. ప్రజలపక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీద్దామన్నారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్యయాదవ్ పాల్గొన్నారు.

మరోసారి మోదీ సర్కారే

» మాజీ మంత్రి డీకే అరుణ


ధన్వాడలో ప్రజలతో మాట్లాడుతున్న డీకే అరుణ

ధన్వాడ, ఫిబ్రవరి 5 : కేంద్రంలో మరోసారి మోదీ సర్కారే వస్తుందని, కేంద్రంలో అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత బీజేపీకే దక్కిందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన పథకాలను ప్రజలకు తెలియజేయడం కోసం నిర్వహిస్తున్న పల్లె అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నారాయణపేట జిల్లా ధన్వాడలో ఆమె విస్తృతంగా పర్యటించారు. ఎస్సీ వాడలోని బీడీ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఛీకొట్టారని, కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రావడానికి విద్యావంతులు, సామాన్య జనం సైతం ఎదురుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల హామీలకు ఇప్పటికీ కార్యరూపం దాల్చడంలేదని విమర్శించారు. రైతుల ఖాతాల్లో రైతుబంధు జమకాలేదని అన్నారు. ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగారు.

జోగుళాంబ ఆలయంలో ఐఏఎస్‌లు

» అమ్మవారిని దర్శించుకున్న టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పురావస్తు శాఖ డైరెక్టర్


ఐఏఎస్‌లకు అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ చైర్మన్, ఈవో

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 5 : జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ ఐదవ శక్తి పీఠాన్ని టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యర్ దర్శించుకున్నారు. రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ భారతిహోలికేరితో కలిసి ఆమె ఆలయానికి వచ్చారు. ఈవో పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, అర్చకులు వారిని ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. మొదట స్వామి వారి సన్నిధిలో వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి తీర్థప్రసాదాలతో పాటు, అమ్మవారి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం వారు ఆలయంలో ఉన్న అన్నదాన సత్రాన్ని పరిశీలించారు. ఆలయంలో మిగిలిన అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగిన అనుమతులు ఇప్పించాలని ఆలయ ఈవో, చైర్మన్‌లు లేఖ అందజేశారు. వీరి వెంట ఆలయ ఉప ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ, ధర్మకర్తలు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి, ఆడివప్ప, సి.వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

పీయూలో స్నాతకోత్సవం, న్యాక్ పర్యటనకు ఆమోదం

» పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్

» హైదరాబాద్‌లో పీయూ డైరీ ఆవిష్కరణ


పాలమూరు యూనివర్సిటీ డైరీని ఆవిష్కరిస్తున్న ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 5 : పాలమూరు యూనివర్సిటీలో ఈ నెలరోజుల్లో నాలుగవ స్నాతకోత్సవం నిర్వహణకు, న్యాక్ పర్యటనకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ అనుమతి లభించిందని పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన పీయూ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈసీ మెంబర్స్‌తో కలిసి యూనివర్సిటీకి చెందిన డైరీని ఆవిష్కరించారు. అంతకుముందు జరిగిన సమావేశంలో పీయూలో న్యాక్ బృందం పర్యటనకు అనుమతి లభించిందని తెలిపారు. నూతన రిజిస్ట్రార్ నియామక అనుమతితో పాటు, యూనివర్సిటీ అభివృద్ధికి సంబంధించిన పనులను సమావేశంలో చర్చించగా వాటిలో కొన్నింటికి ఆమోదం లభించిందని చెప్పారు. కార్యక్రమంలో ఈసీ మెంబర్లు నూర్జహాన్‌బేగం, కిశోర్‌గోపాల్, చందోజీ, విజయలక్ష్మి, ఫణిప్రసాద్, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు

కేజీబీవీ విద్యార్థిని ఎంపిక


ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయులు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 5 : జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని ఎంపికైంది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని జి.సంధ్య ఈనెల ఏడు నుంచి 11వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరిగే 38వ సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కోచ్ అర్చన సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సంధ్యను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. విద్యార్థులు నచ్చిన రంగాల్లో రాణించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష నిధులపై గందరగోళం

» సర్పంచు అకౌంట్‌ను హోల్డ్ చేయించిన కార్యదర్శి

» ఇబ్బంది పెట్టేందుకేనంటున్న మాజీ సర్పంచు

మానవపాడు, ఫిబ్రవరి 5 : పంచాయతీ నిధులను వ్యక్తిగత అకౌంట్‌లోకి మళ్లించుకున్న మాజీ సర్పంచ్ అకౌంట్‌ను బ్యాంకు అధికారులు హోల్డ్‌లో పెట్టారు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని పెద్ద ఆముదలపాడు గ్రామ మాజీ సర్పంచ్ నారాయణ గ్రామంలో సీసీ రోడ్డు మరమ్మతులు, వైకుంఠధామంలో పనులు చేపట్టారు. వీటికి గాను లక్ష రూపాయల నిధులను ఇటీవల పంచాయతీ చెక్కు ద్వారా తన వ్యక్తిగత అకౌంట్‌లో వేసుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు చెక్కుపై తన సంతకాన్ని ఫోర్జరీ చేసి నిధులను అకౌంట్‌లోకి మళ్లించుకున్నారని బ్యాంకుకు తెలిపారు. దీంతో బ్యాంకు మేనేజర్ చైతన్య మాజీ సర్పంచ్ నారాయణకు సంబంధించిన అకౌంట్‌ను హోల్డ్‌లో పెట్టారు. విషయం తెలిసిన గ్రామస్థులు నారాయణ తీరుపై గుసగుసలాడుకుంటున్నారు. మాజీ సర్పంచ్, గ్రామ కార్యదర్శి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటూ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై నారాయణ మాట్లాడుతూ తాను చేసిన పనులకోసం వచ్చిన డబ్బులో వాటా ఇవ్వాలనే డిమాండ్‌తోనే కార్యదర్శి ఈ పని చేశాడని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజును వివరణ కోరగా రెండురోజులు ఆగితే సమస్య సద్దుమణుగుతుందని, ఉన్నతాధికారులతో మాట్లాడతామన్నారు. సంబంధిత నిధులకు గాను నారాయణ అకౌంట్‌ను హోల్డ్ ఉంచిన మాట వాస్తవమేనని బ్యాంకు మేనేజర్ చైతన్య తెలిపారు.

కుటుంబీకుల చెంతకు మతిస్థిమితం లేని వ్యక్తి


కుటుంబీకులతో సురేష్

మానవపాడు, ఫిబ్రవరి 5 : మతిస్థిమితం లేక గత నాలుగు సంవత్సరాల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వ్యక్తి ఎట్టకేలకు కుటుంబీకుల చెంతకు చేరాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడులో మండల కేంద్రంలోని ఆసుపత్రి ఆవరణలో సురేష్(25) అనే వ్యక్తి గత రెండునెలలుగా జీవనం కొనసాగిస్తున్నాడు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన సురేష్‌కు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఎవరూ పట్టించుకునేవారు కాదు. అయినా ప్రతీరోజు అందరిని చూస్తు కొంతమేరకు మాట్లాడేవాడు. గ్రామానికి చెందిన చిన్న భీమిరెడ్డికి కొద్దికొద్దిగా తమిళం రాగా సురేష్‌తో మాట్లాడి అతడి కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్‌ను కనుక్కున్నాడు. ఆదివారం సురేష్ కుటుంబీకులతో మాట్లాడిన భీమిరెడ్డి విషయాన్ని వివరించాడు. దీంతో సురేష్ కుటుంబీకులు సోమవారం మండల కేంద్రానికి చేరుకున్నారు. సురేష్ గత నాలుగు సంవత్సరాల క్రితం బైక్‌పై నుంచి కిందపడి గాయాలపాలై కన్పించకుండా వెళ్లిపోయాడని, తాము వెతికినా కన్పించలేదన్నారు. చివరికి ఫోన్ ద్వారా సమాచారం రావడంతో వచ్చినట్లు వివరించారు. సురేష్‌ది ఎర్రపట్టి గ్రామం, తమదురై జిల్లా, తమిళనాడు రాష్ట్రమని కుటుంబీకులు తెలిపారు.

కోయిల్‌సాగర్ ఆయకట్టుకు

జూరాల నీటిని అందించాలి

» ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కు జిల్లా ఎమ్మెల్యేల వినతి


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమైన ఎమ్మెల్యేలు జీఎంఆర్, అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 5 : జూరాల ప్రాజెక్టు నుంచి 0.75 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి కోయిల్‌సాగర్‌కు ఆయకట్టు రైతులకు రబీ సీజన్‌కు నీరందించేలా కృషి చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డిలు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. సోమవారం సచివాలయంలో మంత్రితో ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. 2005-06 సంవత్సరంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జలయజ్ఞం పేరుతో కోయిల్‌సాగర్‌కు నీరందించేందుకు పనులు చేపట్టిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. రూ.147 కోట్లతో కాలువ పనులు చేయిస్తే కోయిల్‌సాగర్ కింద 20 వేల ఎకరాలకు నీరందించే అవకాశం ఉంటుందని, నిధులు మంజూరు చేయించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలిచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు. ఇరిగేషన్ సీఈ రమణారెడ్డి, ఎస్ఈ చక్రధర్, ఈఈ ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

రేపు పీయూలో బహిరంగ సభ

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 5 : రాష్ట్రంలోని యూనివర్సిటీలలో ఉన్న విద్యారంగ సమస్యలపై ఈనెల ఏడో తేదీన పాలమూరు యూనివర్సిటీలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్జున్, విద్యార్థి నాయకులు తెలిపారు. సోమవారం పీయూలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ యూనివర్సిటీ ఏర్పడి 15 ఏళ్లు గడిచినా కొత్త కోర్సులు ప్రవేశపెట్టలేదని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను జనరల్ కోర్సులుగా మార్చాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఫీజులు తగ్గించాలని, వసతులు మెరుగుపర్చాలని కోరుతూ బుధవారం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు విద్యార్థి నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పరిషత్ విద్యార్థి నాయకులు జైపాల్, శివకుమార్, కృష్ణ, వేణుగోపాల్, ఓంప్రకాష్ తదితరులున్నారు.

జములమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.15.83 లక్షలు

గద్వాల, ఫిబ్రవరి 5 : జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని జములమ్మ దేవాలయంలో సోమవారం హుండీని లెక్కించారు. ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ఆలయ చైర్‌పర్సన్ గాయత్రి ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో హుండీలను ఓపెన్ చేసి లెక్కించారు. నాలుగు నెలల ఆరురోజుల హుండీ మొత్తం రూ.15.83లక్షలు వచ్చిందని వారు తెలిపారు. ఇందులో నగదు రూపంలో 15.15లక్షలు, చిల్లర నాణేల రూపంలో రూ.68వేలు వచ్చింది. మిశ్రమ బంగారం 30గ్రాములు రాగా, మిశ్రమ వెండి మూడు కేజీల 400గ్రాములు వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

బిజినేపల్లి, ఫిబ్రవరి 5 : కొంతకాలంగా తీవ్ర కడుపునొప్పి బాధను భరించలేక ఉరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై పి.నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మడ్డి పుష్పలత(32)కు 15 ఏళ్ల క్రితం తిమ్మాజిపేట ఆర్శితండాకు చెందిన గోపాల్‌గౌడ్‌తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బతుకుదెరువు కోసం పాలెంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చి కూలీ పనులు చేసుకుంటున్నారు. కొంతకాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న పుష్పలత ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఉరి వేసుకుంది. గమనించిన మృతురాలి తండ్రి కృష్ణయ్యగౌడ్ వెంటనే ఇరుగుపొరుగు వారి సహాయంతో ఆమెను కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. కృష్ణయ్యగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కానిస్టేబుల్‌పై ఎస్పీకి భార్య ఫిర్యాదు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 5 : వివాహేతర సంబంధం పెట్టుకుని తనను వేధిస్తున్నాడని ఓ కానిస్టేబుల్ భార్య ఎస్పీకి ఫిర్యాదు చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లికి చెందిన శివలీలకు 2014లో మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం లోకిరేవుకు చెందిన కానిస్టేబుల్ రాజేందర్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం ఈయన రాజాపూర్ పీఎస్‌లో పని చేస్తున్నాడు. వివాహేతర సంబంధం పెట్టుకుని తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భార్య సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌కు ఫిర్యాదు చేసింది. భర్తతో పాటు, ఆయన కుటుంబసభ్యులు వేధిస్తూ దాడికి పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ఇద్దరు చిన్నపిల్లలున్నారని, తనను వదిలించుకోవాలని ఈ రకమైన వేధింపులకు పాల్పడుతున్న భర్తతో పాటు కుటుంబసభ్యులపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితురాలు ఎస్పీని కోరింది. స్పందించిన ఆయన కానిస్టేబుల్‌పై విచారణ జరిపించాలని రాజాపూర్ ఎస్సైకి సూచించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 5 : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలెం గ్రామానికి చెందిన మణెమ్మ, కుర్మయ్య దంపతులు బైక్‌పై వెళ్తుండగా అతివేగంగా వస్తున్న కారు దంపతులను ఢీకొట్టింది. ప్రమాదంలో మణెమ్మ, కుర్మయ్యలు కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ అక్కడినుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

శాయిన్‌పల్లిలో చోరీ

బిజినేపల్లి, ఫిబ్రవరి 5 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం శాయిన్‌పల్లి గ్రామంలో పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిజినేపల్లి నిరంజన్ భార్యతో కలిసి స్వంత పనిపై ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి వెళ్లారు. పని పూర్తి చేసుకొని సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన వారికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి డ్రెస్సింగ్ టేబుల్‌లో పెట్టిన రూ.75 వేల నగదును వెతకగా కనిపించలేదు. దీంతో బాధితుడు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కన్నకూతురిని కడతేర్చిన వ్యక్తి రిమాండ్

బిజినేపల్లి, ఫిబ్రవరి 5 : 14 నెలల కన్న కూతురిని మానవత్వం లేకుండా గొంతు నులిమి ఊపిరి ఆడకుండా చంపివేసిన తండ్రి తిరుపతినాయక్‌ను ఆదివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి రిమాండ్ చేసినట్లు ఎస్సై గోపాల్‌నాయక్ సోమవారం తెలిపారు. హత్య చేసిన కన్నకూతురి శవంతో సహా బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు లొంగిపోయాడు. అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. తిరుపతినాయక్ వాంగ్మూలం ఆధారంగా రిమాండ్‌కు తరలించనట్లు ఎస్సై తెలిపారు.

సూపర్‌మార్కెట్‌లో దొంగతనం

కల్వకుర్తి, ఫిబ్రవరి 5 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్‌లో దొంగతనం జరిగింది. ఇందుకు సంబంధించి ఎస్సై మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్ వెనక ఉన్న హరికృష్ణ సూపర్‌మార్కెట్‌లోకి ఆదివారం రాత్రి దుండగులు చొరబడ్డారు. షాపు పైనుంచి తలుపులు పగులకొట్టి లోపలికి చొరబడిన దొంగలు దుకాణంలో ఉన్న రూ.50వేల నగదు, డ్రైఫ్రూట్స్‌ను ఎత్తుకెళ్లారు. షాపు యజమాని హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దొంగతనం కేసులో నిందితులకు జైలుశిక్ష, జరిమానా

పాన్‌గల్, ఫిబ్రవరి 5 : దొంగతనం కేసులో నిందితులకు ఏడాదిన్నర జైలు, రూ.మూడు వేలు జరిమానా విధించినట్లు ఎస్సై వేణు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన ముంత శశిరేఖ గతేడాది క్రితం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తుండగా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన నిందితులు గోపాలకృష్ణ, వెంకటయ్యలు ఆమె మెడలో గొలుసు తెంచుకొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. నిందితులపై నేరం రుజువు కావడంతో వనపర్తి జ్యుడీషియల్ కోర్టు న్యాయాధికారి రవికుమార్ ఇద్దరికీ ఏడాదిన్నర జైలు, రూ.మూడు వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

తెలంగాణ ప్రాంత ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బి.మల్లేష్ ఎన్నిక


బొడ్డు మల్లేష్


రంగం అంజనేయులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 5 : తెలంగాణ ప్రాంత ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బొడ్డు మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలో దక్ష పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బొడ్డు మల్లేష్ , ప్రధాన కార్యదర్శిగా రంగం అంజనేయులు , కోశాధికారిగా కొండ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.భానుప్రకాష్, ఎ.ఆనంద్‌రెడ్డి, కోశాధికారిగా టి.రాజేశ్వర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్


ట్రస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రమాణం చేస్తున్న లక్ష్మణ్ తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 5 : జిల్లా కేంద్రంలోని వీవీ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా ట్రస్మా ఎన్నికలు నిర్వహించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా పి.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా అయూబ్‌ఖాన్ గెలుపొందారు. జిల్లా కోశాధికారిగా వేణుగోపాల్ ఎన్నికైయ్యారు. అంతకుముందు మహబూబ్‌నగర్ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంశీమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పూజితరెడ్డి, కోశాధికారిగా రాఘవేంద ర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఎన్నిక అయినా జిల్లా కమిటీని, పట్టణ కమిటీని పలు పాఠశాలల కరస్పాండెంట్లు అభినందనలు తెలిపారు. ఎన్నికల అధికారులుగా లక్ష్మణ్‌గౌడ్ , నర్సింహారావు వ్యవహరించారు. అబ్జర్వర్లుగా రాష్ట్ర ట్రస్మా అధ్యక్షుడు మధుసూదన్, చీఫ్ అబ్జర్వర్‌గా యాదగిరి శేఖర్‌రావు వ్యవహరించారు. సమావేశంలో జిల్లాలోని పలు పాఠశాల కరస్పాండెంట్లు , ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం


వైద్య శిబిరంలో పాల్గొన్న పోలీసులు, ఆసుపత్రి దాక్టర్లు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఫిబ్రవరి 5: పట్టణంలోని శ్యామ్యూల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పోలీసు శాఖకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ప్రముఖ గ్యాస్ట్రో ఎండాలజిస్టు పోలీసులకు ఉచితంగా ఫైబ్రో స్కాన్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని అడిషనల్ ఎస్పీ సురేష్, డీఎస్పీ రామారావులు ప్రారంభించారు. అనంతరం డాక్టర్ వివేక్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే గ్యాస్ట్రో ఎండాలజీ సేవలను శ్యామ్యూల్ ఆసుపత్రిలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని, ఫైబ్రోస్కాన్ సేవలు కూడా తమ ఆసుపత్రిలోనే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్యామ్యూల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ శ్యామ్యూల్, గైనకాలజిస్టు డాక్టర్ నితీష, చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ రామకృష్ణ, సిబ్బంది ఆంజనేయులు, రాఘవేందర్ పాల్గొన్నారు.

'బడ్జెట్ కేటాయింపులో సామాజిక న్యాయం పాటించాలి'

జడ్చర్ల, ఫిబ్రవరి 5 : రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులో సామాజిక న్యాయం పాటించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం జడ్చర్ల మండల వనరుల కేంద్రం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో బీసీ డిక్లరేషన్ సభలో ప్రకటించిన విధంగా రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.20వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. బీసీ కులగణన కార్యక్రమాన్ని చేపడుతామన్న ముఖ్యమంత్రి ప్రకటనకు స్వాగతిస్తున్నామని, వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నిరంజన్, వెంకటేశ్, నర్సిములు, విజయ్‌కుమార్, రామస్వామి, మురళి, గోపాల్, రఘు, ఆంజనేయులు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు ఎంపీ టికెట్ బీసీలకు ఇవ్వాలి'

హన్వాడ, ఫిబ్రవరి 5: పాలమూరు పార్లమెంట్ టికెట్ బీసీలకే ఇవ్వాలని అఖిల భారత రజక రిజర్వేషన్ సంఘం జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం హన్వాడలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు చట్టసభల్లో సముచిత స్థానం లేదన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కుల గణన చేపట్టాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కుల గణన చేపడుతామని ప్రకటన ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 26 శాతం బీసీ రిజర్వేషన్ ఉంటే 22కు తగ్గించారని ఆరోపించారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విధంగా ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య రజక సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి, మండల అధ్యక్షుడు మల్లేష్, నాయకుడు నాగన్న, ఎమ్మార్పీఎస్ నాయకుడు యాదయ్య పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి'

బాలానగర్, ఫిబ్రవరి 5: మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ కమల కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామ పంచాయతీల పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలను ప్రస్తావించారు. తిరుమలగిరి ఎంపీటీసీ సభ్యుడు వెంకట్‌రావు నాయక్, కోఆప్షన్ సభ్యుడు జహీర్‌బాషా మాట్లాడుతూ గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను అధికారులు నేటి వరకు పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు కల్యాణి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ బాబురావు, ఎంపీడీవో కృష్ణరావు, వైస్‌ఎంపీపీ వెంకటాచారి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తాత్కాలిక డివైడర్ ఏర్పాటు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 5: పాలమూరు పట్టణంలోని రాజీవ్‌చౌరస్తా- గడియారం చౌరస్తా రహదారి మధ్యలో తాత్కాలిక డివైడర్‌లను ఏర్పాటు చేశారు. రోడ్డును ఆక్రమించి ఫుట్‌పాత్ వ్యాపారం చేస్తున్న తోపుడుబండ్లు, షాపింగ్‌మాల్ పబ్లిసిటీ బోర్డులను జరిపి మధ్యలో ట్రాఫిక్ కోన్‌లను ఏర్పాటు చేశారు. మునిసిపల్ కార్యాలయం ముందు ఇటీవలే సీసీరోడ్డు వేసినా ఆ రోడ్డును సగభాగం ఫుట్‌పాత్ వ్యాపారులు, షాపింగ్‌మాల్‌కు వచ్చే వాహనదారులు వాహనాల పార్కింగ్‌కు వినియోగించడం వల్ల రోడ్డుపై రాకపోకలు సాగిం చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవడంతోపాటు ట్రాఫిక్ జామ్ అవుతుండేది. సోమవారం ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, ఎస్సై శంశోద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు మునిసిపల్ కార్యాలయం- షాపింగ్‌మాల్ మధ్యన ఉన్న రోడ్డును క్లియర్ చేసి మధ్యలో ట్రాఫిక్‌కోన్‌లతో డివైడర్‌లను ఏర్పాటుచేయడం జరిగింది. దీంతో వాహనాలు డివైడర్‌కు రెండువైపులా వన్‌వే తరహాలో వెళ్ళడం వల్ల ఎంతో ఉపశమనం పొందుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల నిర్ణయాన్ని వాహనదారులు హర్షిస్తున్నారు.

'కనీస వేతనాలు ఇవ్వాలి'

పాలమూరు, ఫిబ్రవరి 5 : కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు కలెక్టరేట్‌లో అధికారికి అన్ని రంగాల్లో పని చేసే కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్లు కనీసవేతనాలు, హెల్త్ అలవెన్స్‌తో కలిపి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కిల్లెగోపాల్, ఆకుల వెంకటేష్, ఎర్రం నరసింహులు, బాలరాజు, విశ్వనాథం, ప్రభాకర్, చిన్నికృష్ణ, శివరాజు, యాదమ్మ, అలివేలు, శివమ్మ, అంజమ్మ, కృష్ణ, జంగయ్య, కార్మికులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

చిన్నచింతకుంట, ఫిబ్రవరి 5: వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సీ.శేఖర్ తెలిపారు. సోమవారం సాయంత్రం చిన్నచింతకుంట మండలంలోని పెద్ద వడ్డెమాన్ గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. కూలీలను అత్యధికంగా తీసుకువెళ్తున్న పలు బొలేరో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి నిబంధనలు అతిక్రమిస్తే, వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

డబ్బులన్నా ఇవ్వండి

- అల్లీపూర్ గొర్ల కాపరుల వేడుకోలు - ప్రజావాణిలో కలెక్టర్ రవినాయక్‌కు వినతిపత్రం


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ జి. రవినాయక్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5: బీఆర్‌ఎస్ ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెలను ఇచ్చేందుకు ఒక్కొక్కరి నుంచి రూ. 43,750 ప్రభుత్వం పేరున డీడీ కట్టామని ఇప్పటివరకు సబ్సిడీ గొర్రెలను ఇవ్వలేదని, తమ డబ్బులు తిరి ఇవ్వాలని కోయిల్‌కొండ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన గొర్ల కాపరులు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ జి. రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకవచ్చిన గొర్రెల పథకంలో కొంత మందికి సబ్సిడీ గొర్రెలు వచ్చాయ్, కానీ మా గ్రామంలో ఒక్కొక్కరం రూ. 43,750 చొప్పున 37 మంది డీడీలు తీసి ప్రభుత్వానికి పంపామన్నారు. కానీ, ఎన్నికలు రావడంతో ఈ పథకం ఆగిపోయిందని, ఎన్నికలు అయిపోయిన తర్వాత తిరిగి కొనసాగుతుందని సంబంధిత అధికారులు, రాజకీయనాయకులు చెప్పారన్నారు. గొర్రెలు వస్తాయన్న ఆశతో అప్పులు చేసి డబ్బులు కట్టామని ఆరు నెలలు గడిచినా గొర్రెలు ఇవ్వలేదని వాపోయారు. పథకం కొనసాగితే సబ్సిడీ గొర్రెలు ఇవ్వాలని, లేదంటే తాము కట్టిన డ బ్బులను చెల్లించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నర్సింహ, విష్ణు, మహేందర్, సువర్ణ, కుర్మన్న, సత్యం, పరశు రామ్, రాజు, దేవేందర్, గోవిందు ఉన్నారు.

ఫిర్యాదుల పరిష్కారం వేగవంతం చేయాలి

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. సోమవారం సైతం ఎప్పటిలాగే వ్యక్తిగత సమస్యలు, ఉద్యోగం, ఉపాధి, భూ సంబంధిత, భూ ఆక్రమణలు, ఆసరా పింఛన్లపై ఫిర్యాదులు అందాయి. సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిశీలించి పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి, జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

పొలం చూపడం లేదు

- కందూరు రైతులు

అడ్డాకుల మండలం కందూరు గ్రామ శివారు సర్వే నెంబర్ 483లో 12 ఎకరాల సాగుభూమిని ఎనిమిది బాగాలుగా చేసుకొని తాతాలకాలం నుంచి సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. ఈ మధ్యలో అటవీశాఖ అధికారులు వచ్చి తమ పొలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఐదేళ్ల క్రితమే మీకు మరో చోట భూమి ఇచ్చాం అక్కడ సాగు చేసుకోవాలని అంటున్నారు. కానీ, ఇప్పటివరకు భూమిని తమకు స్వాధీనం చేయడం లేదని గ్రామానికి చెందిన రైతులు చంద్రమౌళి, పెద్ద రాములు, తిరుపతయ్య, శేఖర్, నాగరాజు, పిల్లి చిన్న క్రిష్టయ్య, పిల్లి పెద్ద క్రిష్టయ్య ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

కాందిశీకుల భూమి కబ్జాకు గురవుతోంది

పట్టణంలోని కాందిశీకులకు చెందిన ఏనుగొండ శివారు సర్వే నెంబర్ 273, 275,276, 277,278 లో సుమారు ఐదున్నర ఎకరాల భూమి (రూ.5 కోట్లు విలువ) కబ్జాకు గురవుతోందని సామాజిక కార్యకర్త దిడ్డి ప్రవీణ్ కుమార్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

కమిషనర్ అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలి

జడ్చర్ల : జడ్చర్ల మునిసిపల్ కమిషనర్ మహమూద్‌షేక్ అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని కౌన్సిలర్లు శశికిరణ్, చైతన్యచౌహాన్ కోరారు. సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త దోరేపల్లి రవీందర్‌తో కలిసి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇళ్ల అనుమతులు, వెంచర్ లేఅవుట్‌ల మార్టిగేజ్‌ల అంశంలో నిబంధనలకు విరుద్ధంగా మార్టిగేజ్ రిలీజ్ చేస్తున్నారని ఆరోపించారు. కౌన్సిలర్లు చైతన్యచౌహాన్, శశికిరణ్, శ్రీశైలమ్మ, పుష్పలత, చైతన్యగౌడ్, శ్రావణిల సంతకాలతో కూడిన ఫిర్యాదును కలెక్టర్‌కు అందజేశారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : ప్రత్యేకాధికా రులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. ప్రత్యేకాధికారులు వారి విధులను, బాధ్యతలను పూర్తిగా అవగాహన చేసుకొని విధులు నిర్వర్తించాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిర్వహణ ఆశమాసి కాదని, పూర్తిబాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. రాష్ట్రప్రభుత్వం గ్రామ పంచాయతీలను సక్రమంగా నిర్వహించే గురుతర బాధ్యత ప్రత్యేక అధికారులపై ఉంచిందన్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన ఎంతో ఆదర్శవంతంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పారిశుధ్యం, తాగునీటి సరఫరా అంశాలపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రతీ అధికారి పాలనలో తమదైన ముద్ర వేయాలన్నారు. వారంలో రెండుసార్లు ప్రత్యేకాధికారులు గ్రామ పంచాయతీని తప్పక సందర్శించాలని ఆయా పంచాయతీకి సంబంధించిన ఆస్తుల్ని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రత్యేకాధికారికి పంచాయతీ కార్యదర్శికి మధ్య ఎలాంటి కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చూసుకుని ఇరువైపులా సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ వారం రోజులు గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. టాయ్‌లెట్లు , రోడ్లు, పాఠశాలలో శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్డీవో యాదయ్య, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకట్రామణ, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పనుల జాప్యంతో రాకపోకలకు ఆటంకం

- నాలుగునెలల నుంచి మరమ్మతు పనులు
- మరో నెల రోజులు పట్టే అవకాశం


కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 5: పాలమూరు పట్టణంలోని మినీట్యాంక్ బండ్ బీకేరెడ్డి కాలనీవైపు వరద నీటిని మళ్లించేందుకు కల్వర్టు నిర్మాణానికి నాలుగునెలల క్రితం తవ్వారు. బీకేరెడ్డికాలనీ వైపున్న అలుగు నుంచి నీటిని కట్టకు ఆనుకుని కా లువ తీసుకుని శివశక్తినగర్‌వైపు మళ్లించేందుకు పనులు చేపడుతున్నారు. ట్యాంక్‌బండ్ నుంచి కిందికి దిగి బీకే రెడ్డికాలనీ, భగీరథకాలనీ, షాషాబ్ గుట్టవైపు వెళ్లే దారిని కల్వర్టుకోసం తవ్వారు. నాలుగునెలలుగా పనులు నెమ్మదిగా సాగుతుండటంతో ఈ దారి మూసివేయాల్సి రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కుంటున్నారు. చాలా మంది ఈ మరమ్మత్తు కారణంగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ట్యాంక్‌బండ్‌కు కొద్దిదూరంలో అలుగు దగ్గర చిన్నగా దారిని ఏర్పాటుచేసిన ద్విచక్రవాహనాలు, ఆటోలు మాత్రం రాకపోకలు సాగిస్తున్నాయి. పెద్దవాహనాలు మాత్రం వెళ్లడానికి ఉపయోగకరంగా లేకపోవడంతో చుట్టూ కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కుంటున్నారు. సోమవారం స్లాబ్ వేసేందుకు సిద్ధం చేశారు. స్లాబ్‌వేసినా మరో నెలరోజులు సమయం పట్టే అవకాశం ఉన్నది. ఈ పనులను బీకే రెడ్డికాలనీ, భగీరథకాలనీ కౌన్సిలర్‌లు ఆనంద్‌కుమార్ గౌడ్, రశ్మితప్రశాంత్‌లు పరిశీలించారు. పనులు త్వరిగతిన చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల్లో జాప్యం కారణంగా మూడు,నాలుగు వార్డులకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో పనులు వేగవంతంగా చేపడుతున్నారని తొందరలోనే వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభం అవుతాయని కౌన్సిలర్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

తప్పులు చేస్తే చర్యలు



రికార్డులను తనిఖీ చేస్తున్న పీడీ యాదయ్య

హన్వాడ, ఫిబ్రవరి 5: ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని కల్పించకుండా చేసినట్లు చూపిస్తూ తప్పులు చేస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీవో పీడీ యాదయ్య ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం హన్వాడ మండల పరిషత్ కార్యాలయంలో 2022- 23 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సామాజిక తనిఖీ బృందం ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలోని 35 గ్రామాలలో రూ. 6. 98 కోట్ల పనులు చేశారు. ఈ పనులపై జనవరి 20నుంచి ఈ నెల 5 వరకు గ్రామాల్లో తిరిగి తనిఖీ చేశారు. పనులలో జరిగిన అవకతవకాలపై ప్రజావేదికలో తనిఖీ బృందం వివరించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించినట్లు తెలిపారు. మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు చేసిన తప్పులకు ఫెనాల్టీలు, రికవరీలు వేశారు. ఆడిట్‌లో రూ. 15500ఫెనాల్టీలు, రూ. 20400 రికవరీ విధించినట్లు పీడీ తెలిపారు. కూలీలకు ఖచ్చితంగా పనులు కల్పించాలని అధికారులు గ్రామాలలో తిరిగి అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. ప్రజా వేదికలో ఎంపీడీవో ధనుంజయగౌడ్, ఏపీడీ శ్రీపాద్, ఆడిట్ ఎస్ఆర్‌పీ కొండల్ పాల్గొన్నారు.

లబ్ధిదారులను నమోదు చేయాలి

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), ఫిబ్రవరి 5 : ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద జిల్లాలోని అన్ని గ్రామాల నుండి లబ్ధిదారులను నమోదు చేయించాలని కలెక్టర్ జి. రవినాయక్ సూచించారు. ఇందుకు గాను ఈ నెల 13న కలెక్టరేట్‌లో అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం విధివిధానా లను వివరించారు. లబ్ధిదారులు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ సమర్పిస్తే సరిపోతుందన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా పరిశ్రమల మేనేజర్ బాబురావు, డీఆర్డీవో యాదయ్య, డీపీవో వెంకటేశ్వర్లు, మిషన్‌భగీరథ ఎస్ఈ వెంకటరమణ పాల్గొన్నారు.

కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ

పాలమూరు, ఫిబ్రవరి 5 : మహనీయుల జీవితఘట్టాలు, రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టాలు, ఎస్సీఎస్టీ చట్టాలు, పున్నయ్య కమిషన్ సిపారసులతో కేవీపీఎస్-2024డైరీ కరదీపికలా ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. దళితులు ఐక్యతతో ఉండి సమాజం కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య, మాణిక్యంరాజు, ఆదివిష్ణు, వేణు, శ్రీను పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

పాలమూరు, ఫిబ్రవరి 5 : హన్వాడ మండలం విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్‌పై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని 1104 యూనియన్ నాయకులు రూరల్ సీఐ గాంధీనాయక్‌ను సోమవారం కలిసి విన్నవించారు. హన్వాడ గ్రామ శివారులోని వైన్‌షాపు దగ్గర విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉందని చెబితే దానిని సరిచేసే పనిలో ఉన్న లైన్‌మెన్ బ్యాగరి శ్రీనివాస్‌పై అకారణంగా దాడి చేయటంతో గాయాల పాలైనట్లు తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐని కలిసిన వారిలో అధ్యక్ష, కార్యదర్శులు జి.స్వామి, పాండునాయక్, పెంటన్న, విజయ్, సత్యం పాల్గొన్నారు.

గిరిజన సేవా సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవం

పాలమూరు, ఫిబ్రవరి 5 : జిల్లా గిరిజన సేవా సంఘం నూతన కమిటీని సోమవారం జిల్లా గిరిజన భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షులుగా డి.లక్ష్మణ్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా యం.ప్రతాప్‌నాయక్, కె.రమేష్, కోశాధికారిగా కిషన్‌పవార్, ఉపాధ్యక్షులుగా ఎస్.డాక్య, ఏ.గోవింద్, పి.గోపాల్, ఎరుకల వెంకటేష్, ఆర్.రమేష్, శాంతిరంగ్య వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఎస్.రాజేష్, అసోసియేట్ అధ్యక్షులుగా వి.కిషణ్, కె.చందర్, యం.మనోహర్, ఎస్.రామకృష్ణ, డి.రాజు, ప్రభుచౌహాన్, కె.సూర్య, ఎ.శంకర్, లక్ష్మీబాయి, కె.శంకర్, సి. కుమార్, నరసింహ, పి.తిరుపతి, కె.హరిచంద్, జయప్రద, వి.మోహన్, వి.గోపాల్, వి.మోహన్, శ్రీనివాసులు ఎన్నుకున్నారు.

రికవరీ చేయాల్సిందే

- డీఆర్‌డీవో అదనపు పీడీ జకియా సుల్తానా


సామాజిక తనిఖీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

గండీడ్ , ఫిబ్రవరి 5: ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన వారి నుంచి రికవరీ చేయాల్సిందేనని డీఆర్‌డీవో అదనపు పీడీ జకియా సుల్తానా అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గండీడ్ ,మహమ్మదాబాద్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేసిన పనులపై సామిజక తనిఖీ చేపట్టారు. 2022-23కు గాను పనుల చేసిన రికార్డులను పరిశీలించి పనుల్లో అవకతవకలు చేసిన టీఏలు, ఎఫ్ఏలతో తప్పకుండా సొమ్ము రికవరీ చేయాలన్నారు. 49 గ్రామ పంచాయతీలకు గాను 31 గ్రామాలకు చెందిన రికార్డులను తనిఖీ చేశారు. మిగితా గ్రామాల రికార్డులను మంగళవారం పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ప్రేమలత, జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, అంబుడ్స్‌పర్సన్ సంతోష్‌కుమార్ , ఎంపీడీవో శంకర్ నాయక్ , ఏపీవో హరిచంద్రుడు, టీఏలు, ఆయా గ్రామాల ఎఫ్ఏలు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


కొండాపూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

బాలానగర్, ఫిబ్రవరి 5: బీఆర్ఎస్ వీరన్నపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నరేందర్ కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. సోమవారం మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి. లక్ష్మారెడ్డి బాధితు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవాబ్‌పేట: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి అనే వ్యక్తి సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీ. లక్ష్మారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, గోపాల్ గౌడ్, మధుసూదన్‌రెడ్డి, రుద్రాం కృష్ణ గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, గండు తిరుపతయ్య, శాంతయ్య, శంకర్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 5 : క్యాన్సర్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని డాక్టర్ వినోద్ భరిణి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్ భరిణి మాట్లాడుతూ కాన్సర్‌లో వివిధ రకాల క్యాన్సర్లు ఉన్నాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు పవర్ ప్రజేంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యారుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. పద్మావతి, అధ్యాపకులు శివలీల, సరితారాణి, ఉమా, అనిత, స్వరూప పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయాలు

దేవరకద్ర, ఫిబ్రవరి 5: దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం వివిధ రకాల ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. దాంతో మార్కెట్ కళకళలాడింది. ఆముదాలు 20 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్టంగా రూ. 5369, కనిష్ఠ ధర రూ. 5367, కందులు 79 క్వింటాళ్లు రాగా గరిష్టంగా రూ. 10100, కనిష్టంగా రూ. 9880, పల్లీలు ఏడు క్వింటాళ్లు రాగా గరిష్టంగా రూ. 6400, కనిష్టంగా రూ. 6368 ధర పలికిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ వెంకటేష్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

దేవరకద్ర, ఫిబ్రవరి 5: మండల పరిధిలోని గ్రామపంచాయతీల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరకద్ర ఎస్సైగా నాగన్న

దేవరకద్ర, ఫిబ్రవరి 5: దేవరకద్ర పోలీస్‌స్టేషన్ ఎస్సైగా నాగన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన ఎస్సై వెంకటేష్ బదిలీపై మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలానికి వెళ్లారు. వనపర్తి నుంచి నాగన్న దేవరకద్రకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు.

హన్వాడ ఎస్సైగా వెంకటేష్

హన్వాడ, ఫిబ్రవరి 5: హన్వాడ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా వెంకటేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. దేవరకద్రలో విధులు నిర్వర్తిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన రవినాయక్ రాజాపూర్‌కు బదిలీపై వెళ్లారు.

ఈజీఎస్ ఏపీవోకు సమ్మె నోటీసు అందజేత

జడ్చర్ల, ఫిబ్రవరి 5 : దేశవ్యాప్తంగా ఈ నెల 16న చేపట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసా య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ కోరారు. జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ఈజీఎస్ ఏపీవో భాస్కర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ విధానా లకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. నాయకులు యాదయ్య, సుందరమ్మ, మంజుల ఉన్నారు.

10 నుంచి విగ్రహం ప్రతిష్ఠాపన పూజలు

మిడ్జిల్, ఫిబ్రవరి 5: మండలంలోని మల్లాపూర్‌లో ఈ నెల 10 నుంచి లక్ష్మీచెన్నకేశవస్వామి రాజ్యలక్ష్మీదేవి ధ్వజస్తంభ బలిపీఠ శిఖర ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ జంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న ఉదయం మహాగణపతిపూజ, కంకణధారణతో పాటు పూజల కార్యక్రమం, 11న విగ్రహం ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామి వారి ఊరేగింపు, 12న ఉదయం దానంగాలు, గండదీపాలు, 10గంటలకు రాజ్యలక్ష్మీ సమేతచెన్నకేశవస్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రత్యేక అధికారికి సన్మానం

అడ్డాకుల, ఫిబ్రవరి 5: అడ్డాకుల మండల పరిధిలోని కాటవరంలో సోమవారం ప్రత్యేక అధికారిగా , తహసీల్దార్ ఘన్సీరాం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సమన్వయంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు భాగ్యలక్ష్మి, బీఆర్ఎస్ నాయకుడు రాజు, కార్యదర్శి శ్వేత, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత

హన్వాడ, ఫిబ్రవరి 5: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ కోరారు. సోమవారం మండల కార్మికులు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. గతంలో ఇచ్చిన 12 డిమాండ్లను పరిశీలించి తమకు న్యాయం చేయాలని కార్మికులు బాలకిష్టయ్య చెన్నయ్య, బాలయ్య రాములు, లక్ష్మీ, వెంకటయ్యలు ప్రభుత్వాన్ని కోరారు.